క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కురవి: సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 60 సీట్లకుగాను బాలికలకు 30, బాలురకు 30 సీట్లు ఉన్నాయని వివరించారు. దరఖాస్తులు సంబంధిత వెబ్‌సైట్‌లో స్వీకరించబడతాయని తెలిపారు. మే 7న పరీక్ష ఉంటుందన్నారు. పాఠశాలలో పూర్తిగా ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన చేయడం జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



పెద్దవంగర: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఎదుట జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ అధ్యక్షుడు బోగోజు భద్రయ్య చారి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మల్లికార్జున చారి, జ్ఞానేశ్వర చారి, రత్న విలాచారి, డాక్టర్ వెంకటరామిరెడ్డి, నాగవాణి, ఎంపీటీసీ శ్రీనివాస్, శ్రీరాం సంజయ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి


తొర్రూరు: కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తుందని బాలవికాస మేనేజర్ వై. రమ అన్నారు. బాలవికాస ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా డివిజన్ కేంద్రంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ శుక్రవారంతో ముగిసింది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ సరళ, ట్రైనర్ షాహీనా, మహిళలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



డోర్నకల్: మండలంలోని లింబ్యాతండా గ్రామంలోని రాంసింగ్‌బాబా ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా మండలంలోని తెల్లబండతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రకుంటతండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి, ముత్యాలమ్మతల్లి ఆలయాలు, బొడ్రాయి ప్రతిష్ఠకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ బాలునాయక్, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని తద్వారా దేశభక్తి, సమాజ బాధ్యతలు పెంపొందుతాయని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్‌ఎం కిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రతిపాకలో ఉన్న గిరిజన ఆశ్రమం బాలుర పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల దీవెన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డిప్యూటీ వార్డెన్ వెంకటయ్య, ఉపాధ్యాయులు రాందాస్, వీరు, దేవుల పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

కొత్తగూడ: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర పాలసీ, రీసెర్చ్ ఇన్‌చార్జ్ భుక్య రాజునాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. సమావేశంలో మధు, నవీన్‌నాయక్, నరేష్, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం అంగన్‌వాడి కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో టీచర్ అనుమాండ్ల రమాదేవి గురువారం విధులు ముగిశాక తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం కేంద్రానికి రాగా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. గ్యాస్‌బండా, 100 గుడ్లు, 3లీటర్ల పాలు, 5లీటర్ల నూనే దొంగిలించారని, అంగన్‌వాడీ టీచర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

అంతిమ 'సంస్కారం'

- అనాథ మృతదేహాలకు 'అన్నం' ఫౌండేషన్ ద్వారా అంత్యక్రియలు
- ఆపన్నహస్తంగా నిలుస్తున్న అన్నం శ్రీనివాసరావు

డోర్నకల్: గుర్తు తెలియని అనాథ మృతదేహాలు, రైలు నుంచి జారిపడి ఛిద్రమైన మృతదేహాలకు అన్నం శ్రీనివాసరావు పెద్ద దిక్కుగా మారాడు. మృతదేహాలను మార్చురీలకు తరలించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సహకరిస్తుండటం, అనాథ, గుర్తు తెలియని మృతదేహాలకు సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహిస్తూ శ్రీనివాసరావు ఆపన్న హస్తం అందిస్తున్నాడు. ఖమ్మం రోటరీనగర్‌లో అన్నం ఫౌండేషన్ పేరుతో సేవా సంస్థను ఏర్పాటు చేసిన శ్రీనివాసరావు అనాథలు, వయోవృద్ధులు, మతిస్థిమితం లేనివారు, అంధులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని చేరదీసి అండగా నిలుస్తున్నారు. అన్నం ఫౌండేషన్ సంస్థలో 253 మంది వృద్ధులు, అనాథలు, రోగులు, మతిస్థిమితం లేనివారికి సేవలు అందుతున్నాయి.

గురువును స్ఫూర్తిగా తీసుకుని..

గార్ల గ్రామపంచాయితీ పరిధిలోని పొన్నగంటి గండికి చెందిన శ్రీనివాసరావు 10వ తరగతి వరకు చదువుకున్నాడు. గార్లకు చెందిన మంగపతిరావు 1958లో కందుకూరి వీరేశలింగం పేరిట ఆశ్రమం ఏర్పాటు చేశారు. శ్రీనివాసరావు 1969 నుంచి 73 వరకు ఆశ్రమంలో ఉంటూ చదువుకుని గురువు సేవాభావాన్ని స్ఫూర్తిగా తీసుకున్నాడు. 1978లో టెలికాం డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో 2003 వరకు డోర్నకల్, గార్లలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహించాడు. గురువు సేవా స్ఫూర్తితో 2008లో ఖమ్మంలోని తన ఇంట్లో అన్నం ఫౌండేషన్ పేరుతో సేవా సంస్థను ఏర్పాటు చేసి అనాథలకు అండగా నిలిచారు. 2016లో రోటరీనగర్‌లో విశాల భవనంలోకి ఫౌండేషన్‌ను మార్చి సేవలను విస్తృతం చేశారు.

ఇంటర్‌లో పాఠ్యాంశం...

అన్నం శ్రీనివాసరావు సేవలపై ఇంటర్మీడియట్ సెంకండియర్ ఇంగ్లిష్ పుస్తకంలో పాఠ్యాంశాన్ని చేర్చారు. అడ్డంకులు ఎదుర్కొన్న యోధుడు అనే అర్థం వచ్చేలా 'ది వారియర్ హూ బ్రోక్ ఆల్ బేరర్స్' శ్రీనివాసరావు సేవలపై పారాగ్రాఫ్ రూపంలో పాఠ్యాంశ్యాన్ని చేర్చడం గమనార్హం.

> **భగవంతుడి సేవగా భావిస్తున్నా..**
>
> వృద్ధులు, మతిస్థిమితం లేనివారు, అనారోగ్యంతో బాధపడేవారికి సేవ చేస్తూ భగవంతుడి సేవగా భావిస్తున్నాను. నేను శాఖహారిని. మృతదేహాల తరలింపు సమయంలో వచ్చే దుర్వాసనను మల్లెపూల వాసనగా భావిస్తాను. చాకలి, మంగళి, కాటికాపరి పనులు చేస్తా. ఆటో, అంబులెన్స్‌ను నడుపుతా.
>
> – అన్నం శ్రీనివాసరావు



రైల్వే ట్రాక్ పైనుంచి మృతదేహాన్ని తరలిస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)



కరోనా మృతదేహాలను శ్మశానవాటికకు తరలిస్తూ.. (ఫైల్)



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

సంక్షేమ పథకాలను వివరించాలి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గూడూరు: మూడోసారి సీఎంగా అధికారం చేపట్టడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని తీగలవేణిలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 9ఏళ్లుగా బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ వివరించాలన్నారు. ఇప్పటికే తెలంగాణకు ఎలాంటి సహాయం చేయని బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి కబుర్లు చెబుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు సుజాత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటక్రిష్ణారెడ్డి, నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ ఎండీ.ఖాసీం, ముక్కా లక్ష్మణ్‌రావు, వీరన్న, సురేందర్‌యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలో శ్రీ బీరప్పస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కముటం శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

'స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్'పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

చిన్నగూడూరు: గ్రామాలను మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని, అందుకు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఎంపీపీ వల్లూరి పద్మ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్-2 కార్యక్రమాలను అన్నిగ్రామాల్లో అమలు చేసేందుకు ప్రతి గ్రామం నుంచి నలుగురు చొప్పున మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను మండలంలోని జయ్యారం గ్రామంలో రైతువేదికలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా సమన్వయకర్తలు రవికుమార్, శ్రావణ్‌లు మండల కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, ఎంపీఓ యాకయ్య, ఏపీఎం పాపయ్య, రైతుబంధు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ మంగపతిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో తాగునీటి సమస్య



ధర్నా చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. నాల్గో వార్డు పరిధిలోని నున్నా నారాయణనగర్ కాలనీ, జ్యోతి బస్ నగర్ కాలనీలో తాగునీటి సమస్యతో పాటు ఇతరత్రా సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజమౌళి, మల్లయ్య, అనిత, కళావతి, రెహానా, మంగమ్మ, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కేసముద్రం: వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికి, సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు మురళీనాయక్ అన్నారు. మండలంలోని కల్వల గ్రామ జెడ్పీఎస్ఎస్‌లో అటెండర్‌గా విధులు నిర్వహించిన గుగులోతు గన్యా పదవి విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సంజీవ రెడ్డి, ఎంపీటీసీ గంట అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, నోడల్ హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, పీఎస్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని, దుర్గేష్ దంపతులను, శుక్రవారం మార్కెట్ మాజీ చైర్మన్ మర్రి నారాయణరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్లు బచ్చు పరమేశ్వర్, సంకెపల్లి జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అన్నెపాక వెంకన్న, బీర్రు వెంకన్న, కొమ్ము రాహుల్, మంద సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దడువాయిల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: దడవాయిల సమస్యలు పరిష్కరించాలని దడువాయిల సంఘం రాష్ట్ర కోశాధికారి సరసాని సురేందర్ రెడ్డి అన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్‌ను మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ దడువాయి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చింతల ఉప్పలయ్య, లింగమూర్తి, జనార్దన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దంతాలపల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని పెద్దముప్పారం గ్రామంలో శుక్రవారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు జరిగిన పంట నష్టాలపైన సమగ్ర విచారణ జరిపి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధికూలీలకు కొలతతో సంబంధం లేకుండా రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సక్రు, జిల్లా కోశాధికారి ఆలకుంట్ల సాయిలు, జిల్లా నాయకులు లింగన్న, బిక్షం, సమ్మన్న యాకన్న, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

కైలాస భవన స్థలాన్ని సర్వే చేయాలి



మాట్లాడుతున్న నల్లు సుధాకర్ రెడ్డి

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి ఉన్న కైలాస భవన స్థలం అన్యాక్రాంతం అవుతోందని, వెంటనే సర్వే చేసి భూమిని కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ భూముల పరిరక్షణలో ఈఓ చొరవ తీసుకుని భూములను కాపాడడం అభినందనీయమన్నారు. ఈనెల 5వ తేదీన హనుమకొండలో జరిగే సీపీఐ ప్రజాపోరు యాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు కన్నె వెంకన్న, తురక రమేష్, నాగేశ్వర్‌రావు, బొల్లం విజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



గాయపడిన ఉద్యోగి రాములు

తొర్రూరు: ఆర్టీసీ ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన గాయపర్చిన ఘటన శుక్రవారం రాత్రి డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు రాములు తొర్రూరు ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పని చేస్తున్నాడు. బస్టాండ్ ఎదురుగా ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు బైకులు పార్కింగ్ చేస్తుండగా ఇక్కడ పార్కింగ్ చేయవద్దని రాములు తెలిపాడు. ఆగ్రహానికి గురైన యువకులు ఆర్టీసీ ఉద్యోగిపై దాడికి తెగబడ్డారు. రాళ్లు, పదునైన వస్తువులతో దాడి చేసారు. తేరుకుని పట్టుకునేలోపే దుండగులు అక్కడినుంచి పరారయ్యారు. గాయపడిన ఉద్యోగిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ పరమేశ్వర్ బాధితుడి నుంచి వివరాలు సేకరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

తొర్రూరు: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం డివిజన్ కేంద్రంలో జరిగింది. అదనపు ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన బండ సోమయ్య(39) రోజువారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తండ్రి మరణించడంతో మద్యానికి బానిసై తల్లి, భార్యతో గొడవలకు దిగేవాడు. ఈ క్రమంలో తల్లి కూతురు ఇంటికి వెళ్లగా, భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఒంటరితనంతో ఇబ్బంది పడుతూ శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కేసముద్రం: పంపిణీ చేసిన పరీక్ష ప్యాడ్లతో విదార్థులు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు అందజేశారు. అదే విధంగా గత ఏడాది పదిలో 9.8 పాయింట్లు సాధించిన అనిల్ అనే విద్యార్థికి రూ.2,116లు అందజేసి, సన్మానించాడు. కార్యక్రమంలో సర్పంచ్ దార్ల రాంమూర్తి, హెచ్‌ఎం రాజేందర్, దాత వద్దిరాజు దేవేందర్, బేతమళ్ల చంద్రయ్య, పాల్గొన్నారు.

గార్ల: గార్ల హైస్కూల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను లయన్ క్లబ్ మండల అధ్యక్షుడు తునగర్ విజయ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ మండల గౌరవ అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తొర్రూరు: పేద విద్యార్థులను స్థానికులు ఆదుకునేందుకు ముందుకు రావాలని ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి భూపతి కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భూపతికుమార్ పరీక్ష సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, సిబ్బంది శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి ఏఓ వెంకటరమణకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా గుగ్గిళ్ల పీరయ్య మాట్లాడుతూ.. ఎస్సీవర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని లేనిఎడల తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీని భూస్థాపితం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ రెడ్డి, రజియా, రేణుక, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదల గుడిసెలను తొలగించొద్దు

నెహ్రూసెంటర్: పేదల గుడిసెలను తొలగించకుండా వారికి పట్టాలను ప్రభుత్వం అందజేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ ఎస్‌డీఎల్‌సీ కార్యదర్శి రామచంద్రయ్య అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి చారి హరీశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గుజ్జు కృష్ణవేణి పాల్గొన్నారు.

తండాలో అభివృద్ధి శూన్యం

నెల్లికుదురు: కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చినా భీమానాయక్ తండా రూపు రేఖలు మారలేదని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 2008 సంవత్సరంలో మండలంలోని భీమానాయక్ తండాలో కేసీఆర్ బస చేసిన తండాను బీఎస్పీ పార్టీ బృందం శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, దార ప్రసారావు, రాంబాబు, తండావాసులు పాల్గొన్నారు.

అంగడి వేలం

నర్సింహులపేట: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంత వేలం రూ.13,60,000 వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి సాత్విక్ శుక్రవారం తెలిపారు. నర్సంపేటకు చెందిన భూక్య విజయ్ వేలంను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ వేముల రజిత, ఉప సర్పంచ్ కర్ల నాగన్న, ఎంపీఓ సోమ్‌లాల్ పాల్గొన్నారు.

భూమిపూజ

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, రామాలయం నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల నిర్మల, రమేష్, శశివర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకన్న పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభం

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.9.25లక్షల నిధులతో చేపట్టే తరగతి గదుల పునర్ నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ గంట సంజీవరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంట అశోక్‌రెడ్డి, ఏఈ మానస, బీఆర్‌ఎస్ నాయకుడు లింగాల పిచ్చయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తండధర్మారం గ్రామానికి చెందిన గుగులోతు లక్ష్మి (పిచ్చమ్మ)(60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మృతిదేహాన్ని సందర్శించిన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు సంక్షేమ పథకాలపై శుక్రవారం మండలంలోని బాలాజీపేటలో సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ప్రవీణ్‌కుమార్, వెంకన్న, రాజమౌళి, వెంకన్న, అశ్విని పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కురవి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆంధ్రాబ్యాంకు రైతు సేవా సహకార సంఘం సాధారణ మహాజన సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు అనేక సేవలందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎండీ జి.సుధాకర్, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, నాయకులు పిచ్చిరెడ్డి, రవినాయక్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందు



గార్ల: రంజాన్ ఉపవాస దినాలను పురస్కరించుకొని శుక్రవారం గార్ల మసీద్‌లో ఎస్సై బానోత్ వెంకన్న ఉపవాసం చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మసీద్ అధ్యక్షుడు ఎండి అబ్దుల్ ఖదీర్, రహీం పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌లో..



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలికల పాఠశాలలో..



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో..

జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కారు డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: కారు డ్రైవర్ల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, ఎంవీఐ యాక్ట్‌ను సవరించాలని తెలంగాణ రాష్ట్ర క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కన్నం నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో సంఘం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రమేష్, నవీన్, శ్రీను, వెంకన్న, నరేష్, సాయి, బాలు పాల్గొన్నారు.

'దాడి చేయడం అన్యాయం'

కురవి: మండలంలోని మోద్గులగూడెంలో దివ్యాంగుడు రాసాల నవీన్‌పై గురువారం రాత్రి కొందరు వ్యక్తులు దాడి చేసి కొట్టడం అన్యాయమని పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా డిమాండ్ చేశారు. శుక్రవారం దాడికి గురైన నవీన్‌ను ఆయన పరామర్శించారు. ఆయన వెంట సారయ్య, యాకయ్య, ఉమేష్, మహేష్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.